

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

02 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


## ప్రజారంజక పాలన
# కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- నెల్లూరు 4వ డివిజన్లో పెన్షన్లను పంపిణీ చేసిన మంత్రి నారాయణ
- రాష్ట్రవ్యాప్తంగా 63,61,380 మంది లబ్ధిదారులకు రూ.2746.52 కోట్ల పైన పింఛన్లు అందజేత
- సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన ప్రభుత్వం
- ప్రజల సంతోషమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల ఒకటో తారీఖున పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరుగుతుందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నాలుగో డివిజన్‌లోని దీన దయాల్ నగర్‌లో సోమవారం పలువురు పింఛన్ లబ్ధిదారులకు మంత్రి నారాయణ సామాజిక పింఛన్లను

మిగతా 2



# నెల్లూరుకు రక్తపు మరక





- రాజకీయ ఒత్తిళ్లకు కళ్ళు తిరిగి పడిపోతున్న ఎస్పీ
- రౌడీల హల్చల్‌తో మసకబారుతున్న నెల్లూరు చరిత్ర

ప్రశాంతతకు నెల్లూరు మారుపేరు.. ప్రజా ప్రతినిధులు హుందాతనానికి పెట్టింది పేరు.. పోలీస్ దక్షతకు నెల్లూరులో నిలువుటద్దంగా నిలిచింది. జస్పాల్ సింగ్ ఎస్పీ మొదలు, శ్రీనివాస్ రెడ్డి ఎంకౌంటర్‌లతో సెంథిల్ కుమార్ పోలీసింగ్‌తో జిల్లాలో నేరస్తులకు వెన్నులో వణుకు పుట్టించింది.



నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

జిల్లాలో డాన్‌లు.. మహిళా డాన్‌లు.. భూకబ్జాలు, డ్రగ్స్ మాఫియా చెలామణి అవుతుందంటే జిల్లాలో పోలీస్ బలహీనామా.. రాజకీయా క్రీడనా.. అనేది ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతతకు మారుపేరైనా నెల్లూరులో రౌడీల స్వైరవిహారాన్ని జిల్లా ప్రజలు జీర్ణం చేసుకోలేకపోతున్నారు. డ్రగ్స్ మాఫియా ఒకపక్క, మద్యం మాఫియా, తెల్లరాయి మాఫియా, ఇసుక మాఫియాలను సృష్టించుకొన్న చరిత్ర నెల్లూరు రాజకీయాలకే ఇటీవల కాలంలో చెల్లింది. ఒక సాధారణ మహిళ.. రౌడీలను సమీకరించి డాన్‌గా చెలామణి అవుతుందంటే ప్రజారక్షణ ప్రమాదంలో పడినట్లయింది. పోలీస్ శాఖలోని కొందరు ఆమెకు దాసోహం అయ్యారంటే.. ప్రజారక్షణకు భరోసా కరువైంది. పోలీస్ శాఖలో గతంలో లా అండ్ ఆర్డర్‌లో డీఎస్పీ, సీఐలను ఎస్పీ నియమించుకొనేవారు, మారిన రాజకీయాలు వలన కింది స్థాయి అధికారులను ప్రజా ప్రతినిధులు నియమించుకుంటుండంతో పోలీస్ పనితీరులో పెనుమార్పులు చోటు చేసుకొన్నాయి. దీనికితోడు ఎస్పీల పనితీరు దారుణంగా బలహీన పడటంతో జిల్లాలో హత్యలు, రౌడీలు చెలామణికి మార్గం సుగమమైంది.

ఒక సాధారణ మహిళ అరుణ అనే ఆమె.. రౌడీలను సమీకరించి ఒక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటే, అది పోలీసులు కానీ, ఇటు పొలిటీషియన్‌లు కానీ గుర్తించపోవడంలో ప్రజల ఆవేదన, అనుమానాలను వ్యక్తం చేస్తుంది.

లాడ్జీలో రౌడీలు ఒక శాసనసభ్యుని హత్యకు పథకం ప్రకారం ప్రణాళికలు వేస్తుంటే.. జిల్లాలో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలు ఏమి చేస్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. జిల్లా ఎస్పీకి ముందే తెలుసునని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించడం మరో సంచలనానికి దారి తీసింది. అంతేకాకుండా గతంలో అనేకసార్లు ఐదు మర్డర్లు జరగడం, ఏకంగా ఎమ్మెల్యే హత్యకు ప్రణాళిక రూపొందించడం

-మిగతా 2లో

## కావలి ఎమ్మెల్యే కావ్య అక్రమాలపై
# విచారణ జరిపించాలి

**కలెక్టర్‌కు వైసీపీ నేతలు వినతి**



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ రూరల్ ఇంచార్జ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎమ్మెల్యే కావలిలో అక్రమ గ్రావెల్ దందా నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బయట పెడదామని ప్రయత్నిస్తే.. ఈరోజు ఆయనపై అక్రమ కేసు బనాయించడం కక్ష సాధింపు చర్యలో భాగమేనన్నారు. ఎమ్మెల్యే లేని

-మిగతా 2లో

## పీజీఆర్ఎస్ అర్జీలను
# సకాలంలో పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 436 అర్జీలు**

2లో




నేటి దినపత్రిక సూర్య వార్షికోత్సవ శుభాకాంక్షలు

ARKA EYE HOSPITAL
అర్క ఐ హాస్పిటల్



ప్రపంచ ప్రామాణికమైన అద్వితీయ సదుపాయాలు, అత్యంత అనుభవము కలిగిన నైపుణ్యమైన వైద్యులతో సంపూర్ణ సమున్నత కంటి వైద్యం



IOL MASTER 700
ACCURA MEASUREMENT OF EYE
SIGNATURE PRO PHACO
PRECISE AND CLEAR PHACO
VISX STAR D I DESIGN
COMPLETE REFRACTIVE CORRECTION
NIDEX OCT
PERFECT RETINAL SCAN
ALCON CONSTELLATION
MICRO RETINAL SURGERY
PENTACAM
HIGH RESOLUTION CORNEAL SCAN
IDRA D E-eye
DRY EYE SUIT



డా॥ ఓ. గోపాల కృష్ణ

16-2-102/1 కాంప్లెక్స్ / రైల్వేట్రాక్ రోడ్, పొగతోట, నెల్లూరు.
ఫోన్ 9849221738, 8179998916

వెల్ఫేర్ ఆఫీసర్ కావలెను

అల్ఫా మెరైన్ లిమిటెడ్, పెయ్యపాళెం (గ్రా), కొడవలూరు (మం), శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వారి ఫ్యాక్టరీకి వెల్ఫేర్ ఆఫీసర్ నియామకానికి తగిన అభ్యర్థుల కోసం వెతుకుతోంది. అభ్యర్థులు ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 76(బి) ప్రకారం గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి ఎంహెచ్‌ఆర్ఎం లేదా పిజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను టెస్టిమోనియల్స్ మరియు సిటిసి వివరాలతో "adminhr@alphamarinedlimited.com" కు 7రోజుల్లోపు పంపండి.

# కావలి ఎమ్మెల్యే కావ్య అక్రమాలపై విచారణ జరిపించాలి

*(మొదటి పేజీ తరువాయి)*



ప్రాంతంలో డ్రోన్ పంపితే ఎమ్మెల్యేపై హత్యాయత్న ప్రయత్నం జరిగిందని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై అక్రమ కేసు పెట్టడం విడ్డూరమన్నారు. జిల్లాలో ఎన్నడూ ఇలాంటి రాజకీయాలు చూడలేదన్నారు. రాజకీయాల్లో ఒక దుష్ట సంస్కృతిని తీసుకువచ్చి కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. కావలిలో జరుగుతున్న అక్రమ గ్రావెల్, మనీ స్కాంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసి న్యాయ విచారణ జరిపించాలని కోరామని తెలిపారు. మనీ స్కాం వెనుక అసలు ఎవరున్నారో, ఎందుకు ఆ స్కామ్‌ను ఎమ్మెల్యే తొక్కి పెట్టాలని చూస్తున్నాడని, ఈ నిజాలన్ని విచారణలో వెలుగులోకి వస్తాయన్నారు. అలాగే అన్నవరం క్వారీపై విచారణ జరిపి అక్రమాలు నిగ్గు తేల్చాలని కలెక్టర్‌ని కోరామని తెలిపారు. రెండు రోజుల క్రితం కావలికి వెళ్లి అన్నవరం క్వారీలో జరుగుతున్న నిజాలను వైఎస్ఆర్సిపి ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తే వైఎస్ఆర్సిపి నేతలను పోలీసుల చేత హౌస్ అరెస్టులు చేయించి.. ఎక్కడికి అక్కడ చెక్‌పోస్టులు పెట్టి అడ్డుకోవడం చూస్తుంటే ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నియంతృత్వ పోకడలు అర్థమవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తాను నిప్పునాలో నిజాయితీ ఉందని ప్రెస్‌మీట్‌లు పెట్టి చెప్పడం కాదని, నువ్వు అంత నిజాయితీపరుడివే అయితే.. నీ క్వారీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. అది చేయకుండా వైఎస్ఆర్సిపి నేతలను అవహేళన పరచడం, వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని విచారణ జరిపించకపోతే కచ్చితంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చలో అన్నవరం కార్యక్రమాన్ని చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్ విషయంలో వాస్తవాలను తెలియజేసేందుకు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తే ఆయనపై 307, ఎస్సీ ఎస్టీ నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గం అన్నారు. కావలిలో జరుగుతున్న ఉదంతాన్ని వైయస్ఆర్సీపీ ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే కావలి ఎమ్మెల్యే నోటికి వచ్చినట్టు ఇష్టారాజ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా ఒక స్థాయికి వచ్చిన వ్యక్తి ఇలా మాట్లాడుతుండడాన్ని ఆయన పక్కన ఉన్న వారే కాకుండా కావలి ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని అన్నారు. కావలికి వస్తే మీ తలలు తెగుతాయని కావ్య కృష్ణారెడ్డి మాట్లాడడం, ఆయన రౌడీ రాజకీయాలకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ఆర్సిపి కావలి వెళ్లేందుకు ప్రయత్నిస్తే వైఎస్ఆర్సిపి నేతలను హౌస్ అరెస్టులు చేసి అడ్డుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ ఘటనపై కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మేమే పోలీసులను పిలిచి హౌస్ అరెస్టులు చేయించుకున్నామని వ్యాఖ్యానించడం విడ్డూరమన్నారు. అయితే జాతీయ రహదారి వెంబడి చెక్ పోస్ట్‌లు పెట్టి వాహనాలను ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించడం తాము చెబితేనే పోలీసులు చేశారా.. అలాగే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఇంటి వద్ద 6 చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించారే అది కూడా తాము చెబితేనే పోలీసులు చేశారంటారా చెప్పాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఏ పార్టీ అయినా అధికార పార్టీ చేస్తున్న అక్రమాలు అవినీతిపై ప్రశ్నిస్తూనే ఉంటుందని, అలాగే వైఎస్ఆర్సిపి కూడా ప్రశ్నించిందన్నారు.

ప్రశ్నించిన దానికి సమాధానం చెప్పకుండా ఈరోజు ఎమ్మెల్యే నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం అయన కుసంస్కారానికి నిదర్శనం అన్నారు. వారు చెప్పి న క్వారీ వద్దకు డ్రోన్ పంపించి నిజాలు తెలుసు కునేందుకు ప్రయత్నిస్తే ఇది ప్రైవేట్ ప్రాపర్టీ ఇక్కడకు ఎలా డ్రోన్ పంపిస్తారని అడిగారే, అయితే అందుకు సంబంధించి మాత్రమే కేసు నమోదు చేయాలే తప్ప మిమ్మల్ని చంపేందుకు ప్రయత్నించారన్న అభియోగం మోపి హత్యాయ త్నం కేసు ఎలా నమోదు చేస్తారని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని ప్రశ్నించారు. అధికారం ఉంది కదా అని.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనం విజయ కుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారంజక పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

*(మొదటి పేజీ తరువాయి)*



అందజేశారు. డివిజన్‌కు విచ్చేసిన మంత్రికి పెన్షన్‌దారులు, టిడిపి శ్రేణులు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి ముందుకు సాగారు. పెన్షన్ దారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్న తనతో నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 63,61,380 మందికి నేడు సుమారు రూ.2746.42 కోట్ల పైచిలుకు పెన్షన్ నగదును అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తొలి రోజునే 99 శాతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఈ పరిస్థితి లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడు అని మంత్రి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన దిశగా అడుగు వేస్తున్నదని హామీలను పూర్తి చేయడం జరుగుతుందని సూపర్ సిక్స్ పథకాలు పూర్తి చేశామని మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే సామాజిక పింఛన్లను 4 వేల రూపాయలకు పెంచి మూడు నెలల ఎరియర్స్‌తో కలిపి ఒకేసారి 7 వేల రూపాయలు నగదు చెల్లించడం జరిగిందన్నారు. అంతేకాకుండా మహిళల అభ్యున్నతికి సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు మరియు ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు సోదరులకు 20 వేల రూపాయలు వంతున జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తల్లికి వందనం కార్యక్రమం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి సుమారు 67 లక్షల మంది లబ్ధిదారులకు 15 వేలు వంతున చెల్లించడం జరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం మంచి విజయాలను అందుకుందని నిన్న జరిగిన ర్యాలీలో మహిళలు సుమారు 10 వేల మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలనే విజన్ సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యం అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు చెప్పినవన్నీ చేయడంతో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యిందని కొనియాడారు. కూటమి ప్రభు త్వం వచ్చిన వెంటనే చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ సూపర్ సిక్స్‌లో భాగంగా పెన్షన్ నగదు పెంపుదల చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలన నిర్వాహకం కారణంగా ఖజానా ఖాళీ అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని చంద్రబాబు అపారమైన అనుభవంతో నిలబెట్టుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పది లక్షల కోట్లు అప్పు చేసి వెళ్ళిందని మంత్రి మండిపడ్డారు. అయితే దేశం లో ఎక్కడ ఇంత భారీగా పెన్షన్ ఇచ్చిన దాఖ లాలు లేవని, ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పూర్తి గా అరాచక పాలన సాగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజా పరిపాలన అందిస్తూ మంచి ప్రభుత్వంగా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మన ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటీసీ విజేతారెడ్డి, నగర అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఇన్‌చార్జ్ డిఆర్వో విజయ్‌కుమార్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

### ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 436 అర్జీలు :

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 436 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 174, మున్సిపల్‌శాఖకు సంబంధించి 41, సర్వేకు 18, పంచాయతీరాజ్‌శాఖకు 38, పోలీసుశాఖకు 62, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 11 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు రక్తపు మరక

*(మొదటి పేజీ తరువాయి)*



ప్రశాంత జిల్లాకు ఒక రౌడీల నెత్తుటి మరక చోటు చేసుకుంది. జిల్లాలో సంఘటనలు జరిగిన ప్రతిసారీ రాజకీయ ఒత్తిళ్లకేమో కానీ, నేర సమీక్ష సమావేశాల్లో ఎస్పీ కళ్లు తిరిగి పడిపోవడం చోటు చేసుకుందంటే జిల్లాలో నేర ప్రవృత్తి ఏస్థాయిలో ఉందో.. జిల్లా ఎస్పీ ఎంత ఒత్తిడికి గురవుతున్నారో అవగతమవుతోంది. గతంలో జిల్లా ఎస్పీలుగా పని చేసిన జస్పాల్ సింగ్, శ్రీనివాసరెడ్డి, సింథెల్ కుమార్‌లు జిల్లాలోని నేరస్తుల వెన్నులో వణుకు పుట్టిస్తే.. ఆ తర్వాత వచ్చిన ఎస్పీలు ఆ తరహా పోలీసింగ్ చేయలేదని ప్రజల్లో అభిప్రాయం నెలకొంది. జిల్లాస్థాయిలో ఎస్పీ బలహీన పోలీసింగ్ చేసిన నేపథ్యంలో కిందిస్థాయి అధికారులు మాకెందుకులే అని నిర్లక్ష్యం చూపడంతో ఇటు పోలీసులు తాస్కార ధోరణి అవలంభించడంతో రౌడీలు చెలామణి ఉధృతమయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రజాప్రతినిధులు సైతం పోలీసుల వైఖరిని విమర్శి స్తున్నారు. భూ కబ్జాలు, డ్రగ్స్ మాఫియా, మద్యం మాఫియా.. ఇలా ఒకటి కాదు, అనేక నేర ప్రవృత్తికి సంబంధించిన విషయాలు నెల్లూరు కేంద్రంగా చోటు చేసుకుంటుండంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'లా అండ్ ఆర్డర్'లో రాజీ పడేది లేదని, పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామన్నప్పటికీ.. నెల్లూరులో ఎస్పీ నుంచి కానిస్టేబుల్ వరకు అలాంటి పరిస్థితి లేదని, నేరస్తులదే రాజ్యమని, వారితో చేతులు కలిపిన కిందిస్థాయి అధికారులదే పైచేయి అని ప్రజలు భావి స్తుండటంతో భయబ్రాంతులు నెలకొన్నాయి. ఇకనైనా ముఖ్యమంత్రి నుంచి పోలీసు ఉన్నతాధికారుల వరకు నెల్లూరు పోలీసుల పనితీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, వారి పనితీరుపై శస్త్రచికిత్స చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. రౌడీ మూకలకు కళ్లెం వేసి మాఫియాలకు, డాన్‌లకు మూకుతాళ్లు వేసి ప్రజల ప్రాణ, మాన రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# అభివృద్ధికి గాడ్ ఫాదర్ చంద్రబాబు నాయుడు

- డిజిటల్ సేవలను పరిచయం చేసిన ఘనుడు చంద్రబాబు
- జిల్లాలోనే ఉదయగిరి నియోజకవర్గం నెంబర్ వన్‌గా చేస్తా..
- వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మొద్దు ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అర్హులైన ఏ ఒక్కరికి పెన్షన్లు తొలగించడం లేదని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్ రెడ్డి అర్హులైన వారికి పెన్షన్ తొలగిస్తున్నట్లుగా కొత్త కొత్త డ్రామాలకు తెరతీస్తున్నారని కానీ వారి మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి గ్రామంలో తొలిఅడుగు సుపరిపాలన కార్యక్రమం మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకల సురేష్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ నాయకులు, మండల నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిసారిగా ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టి నేటికీ 30ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా నారా చంద్రబాబునాయుడు కి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాల కాలంలో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ అభివృద్ధి–సంక్షేమాల సమన్వయంతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. మహిళా సాధికారత –కొత్త దారులు దేశంలోనే తొలిసారిగా డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి లక్షలాది మహిళలకు ఆర్థిక బలం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ విమానాశ్రయం నిర్మాణం, టెలికాం రంగంలో కీలక మార్పులు చేసి ఆధునికతకు శ్రీకారం చుట్టారు. ఆధునిక రవాణా–ఐటీ విప్లవం నేషనల్ హైవేలు, రోడ్ల విస్తరణ చేసి రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా తీర్చిదిద్దుతూ, హైటెక్ సిటీ నీ ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించి, విద్య, ఉపాధి రంగాల్లో సంచలన మార్పులు తీసుకొచ్చారు. పేదల కోసం అన్న క్యాంటీన్ ప్రారంభించి 5 రూపాయలకే భోజనం అందించారు. రైతుల కోసం డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ, నదుల అనుసంధానం ద్వారా సాగునీరు, తాగునీటి అవసరాలకు అండగా నిలిచారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సామాజిక న్యాయం సాధించారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని జిల్లాలోని నెంబర్ వన్ స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తానని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు 12 నెలల కాలంలో ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధికి 50 కోట్ల 750 లక్ష రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. నా సొంత గ్రామా అభివృద్ధి కోసం 36 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే రామాపురం ప్రధాన రహదారి సమస్యపై గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కాకర్ల సురేష్ ప్రభుత్వంతో చర్చించి కోటి 60 లక్షలు సీసీ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. రామాపురం పంచాయతీ పరిధిలో ఉన్న తురకపల్లి గ్రామానికి రహదారి వేసేందుకు కోటి 20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని అన్నారు. కాకర్ల ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యం, విద్య పలు రకాలైన కార్యక్రమాలకి త్వరలోనే శ్రీకారం చుట్టుతానని అన్నారు. కలిగిరిలో 250 ఎకరాలలో పార్కింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల కాలంలో ఉదయగిరి నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పదంలో ముందుకు నడిపిస్తుందని అన్నారు.రేషన్ పంపిణీ మరింత పారదర్శంగా జవాబుదారీతనంగా నిర్వహించాలని లక్ష్యంతో పాత కార్డులు స్థానంలో రాజముద్రతో ఏటీఎం కార్డు సైజులో ముద్రించి క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను రాష్ట్రమంతట పంపిణీ చేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు ముజే లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్ యాదవ్, గ్రామ అధ్యక్షులు పొద మాధవరావు, గండిపాలెం ప్రాజెక్టు డైరెక్టర్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, డైరెక్టర్లు మనం కొండలరావు, వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ వెంకయ్య, వైస్ ఎంపీపీ టు దేవన బోయిన మధు, టిడిపి నాయకులు ఆంద్ర బాల గురువారెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, లోకసాని రవి, లాబాను, పామురుపల్లి వెంకటయ్య, మాగంటి శాంతమ్మ, వేమూరి భాగ్యలక్ష్మి, యర్రంరెడ్డి పల్లి గ్రామస్తులు సంధి రెడ్డి మాల కొండయ్య, రాయవరపు మాలకొండలరావు, దుద్దుకూరి వెంకటరత్నం, చెన్న కృష్ణ, ఆయా శాఖల అధికారులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ అలేఖ్యను సత్కరించిన ఆర్యవైశ్యులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పార్టీ సీనియర్ నాయకులు అయిన స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి కుమార్తె మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ ఇవాళ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా జరిపించిన సందర్భంగా కావలి ఆర్యవైశ్యులు ఏఎంసీ చైర్మన్ అలేఖ్య గృహానికి వెళ్లి వారి కుటుంబాన్ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి కావలి పట్టణ, నియోజకవర్గ ప్రజలకు చేసిన గొప్ప, మంచి కార్యములు ఈరోజు పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, వారి పేరు చెబితేనే మహానుభావుడండి అంటూ ప్రతి పేదవారు ఈరోజు ఆయన గురించి తెలియని వారంటూ ఎవరు ఉండరు. ఆ మహా నాయకుని పట్ల ఉన్న ప్రేమ అభిమానాలు ఆయన మంచితనాన్ని ఈరోజు వారి కుమార్తెకు ఈ పదవి పట్టం కట్టిందని తెలిపారు. అలాగే కావలి పట్టణ నియోజకవర్గ ప్రజలకు వినలేని సేవలు అందించి తండ్రి బాటలో పయనించాలని తెలిపారు. కార్యక్రమంలో సోమిశెట్టి ఉమామహేశ్వరరావు సోమిశెట్టి వెంకట రవి, సాయి, అమర వేదగిరి, జొన్నలగడ్డ రాజశేఖర్, పేటేటి వెంకటరమణ, ఈశ్వర్, నవీన్, అమర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్ల సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సోమవరపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆత్మకూరుకు చెందిన మహిమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాష్కరరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా భాస్కరరెడ్డిని ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ఇప్పటికే నెల్లూరు జిల్లా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడుగా, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్యాప్టోకు జిల్లా కోచైర్మెన్‌గా వ్యవహరిస్తున్నారు. విధులపట్ల అత్యంత అంకితభావం, నాయకత్వంపట్ల అత్యంత పటిమ కలిగిన భాస్కరరెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రధానోపాధ్యాయులసంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నికకావడం అరుదైన అవకాశంగా పలువురు భావిస్తున్నారు. ఆయన ఎంపికపట్ల ఆత్మకూరు ప్రాంతంలో ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు, వివిద రాజకీయపార్టీలనాయకులు, వివిద ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. ఈసందర్భంగా తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర నాయకులు తనను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకోవడం సంతోషదాయకమని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రధానోపాధ్యాయులు హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి, కోర్కెల సాధనకు తనవంతుగా చిత్తశుద్ధితో ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తానని, అవసరమైన పోరాటాలు సాగిస్తానని భాస్కరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగానే కాకుండా తరచూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి అక్కడి తమ సంఘ పరిస్థితులను పరిశీలిస్తానని, అవసరమైన ఉద్యమాలకు శ్రీకారం చుడతామని సోమవరపు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని, తమ సంఘ రాష్ట్ర నాయకులకు కూడా అందుబాటులో ఉంటాననిభాస్కరరెడ్డి పేర్కొన్నారు. తీరికసమయాన్ని ఇంకాస్త అధికంగా కేటాయించి యూనియన్ పటిష్టతకు, అందరి తమ సభ్యుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పట్టుదలగా సంతోషంగా పనిచేస్తానని భాస్కరరెడ్డి వెల్లడించారు.తనకు తమ సంఘంలో రాష్ట్రస్థాయి పదవి లభించడం తనలో ఆత్మవిశ్వాసం పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు.తనకు ఈ అవకాశం కల్పించిన తమ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రవి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, నెల్లూరు జిల్లా సంఘ అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు, జిల్లాలోని అందరు గెజిటెడ్‌హెడ్మాస్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలని భాస్కరరెడ్డి పేర్కొన్నారు. తనకు అభినందనలు తెలిపిన తమ యూనియన్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిద పార్టీల, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని సోమవరపు పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బోగోలు మండలంలోని ఉమా మహేశ్వరపురం పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంచడం జరిగింది. ఈ యొక్క పింఛన్ పంపిణీ కార్యక్రమంలో బోగోలు మండల మండల పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇందుపూరు రామ్మోహన్ రెడ్డి, బూత్ ఇంచార్జి ఘట్టాల సుబ్బయ్య, ఈవోపీఆర్డి నయీమ్ సచివాలయ సిబ్బంది పాల్గొని పంపిణీ చేశారు.

## షఫీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జగత్ ప్రవక్త ముహమ్మదుల వారి జన్మదినం సందర్భంగా బార్కాస్ సెంటర్‌లోని హజరత్ ఖాదర్ ఔలియా నిషాన్ వద్ద రాష్ట్ర ముస్లిం నాయకులు సంగం షఫీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సయ్యద్ సమీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మానవులంతా ఒకే తల్లి, తండ్రి బిడ్డలని ప్రవక్త తెలపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షబ్బీర్, మున్వర్, సాలార్, ఎస్ఆర్ ఇలియాస్, జుబేర్, మంజూర్, ముస్తాక్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

● నెల్లూరు మంత్రి క్యాంప్ కార్యాలయంలో 47 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ● నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏడాదిన్నర కాలంలో 183 మందికి రూ. 2.15 కోట్ల నిధులు పంపిణీ ● అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వం ● రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఆర్థిక పరిస్థితి బాగాలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నెల్లూరు సిటీ నియోజక వర్గంలోని 47 మంది పేదలకు 49,37,357 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో మంత్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న లబ్ధిదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేని వారికి సీఎం సహాయనిధి సంజీవినిలా నిలుస్తోందన్నారు. పరిస్థితి బాగోలేక సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎవరు దరఖాస్తు చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా నెల్లూరు సిటీ నియోజక వర్గంలోనే ఏడాదిన్నర కాలంలో 183 మందికి 2కోట్ల 15లక్షల రూపాయల సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు మంత్రి చెప్పారు. పేదలకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కొట్టాయని హర్షం వ్యక్తం చేశారు. విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నారని తెలియజేశారు. పరిశ్రమల స్థాపిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడిలో పడుతుందన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మన ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను గత ప్రభుత్వం ఆపేసిందని, అయితే గత ప్రభుత్వంలో మంజూరైన పనులు మన ప్రభుత్వంలో కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలకు ఏమి కావాలో అది చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా నాయకుడు వైయస్సార్ వర్ధంతి

▶ కొండా రాజగోపాల్ రెడ్డి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రైతు బాంధవుడు, ప్రజా నాయకుడు స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమ సభను విజయవంతం చేసేందుకు మండల వైసీపీ శ్రేణులు అందరూ కథలు రావాలని ఉదయగిరి మండలం వైసిపి కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రాలలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా 104, 108, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి పథకాలకు రూపకల్పన చేసిన మహానేతకు నివాళులు అర్పించాలని ఆయన ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను కోరారు. ముందుగా వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ, అన్న ధనం చేయనున్నారు. అన్నదానం మండలంలోని ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు కార్యకర్తలు కలసి రావాలని ఈ సందర్భంగా కొండా రాజగోపాల్ రెడ్డి తెలియజేశారు.

## నేడు వైయస్ వర్ధంతి కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయవల సిందిగా మండల వైసీపీ కన్వీనర్ రేవనూరు శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. వింజమూరులో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడానికి వింజమూరు పాత బస్టాండు సెంటర్లో ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్దకు మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయవలసిందిగా కోరుచున్నాము. వింజమూరు మండలంలోని ప్రతి గ్రామంలోని వైయస్సార్ విగ్రహం దగ్గర వర్ధంతి కార్యక్రమం నిర్వహించి నివాళులుఅర్పించవలసిందిగా ఆయన కోరారు.

# సాగరమాల ప్రాజెక్టు రహదారిపై రైతులు ఆందోళన

● రెవెన్యూ శాఖ ప్లాన్ దాఖలుప్రకారం దారి ఇవ్వాల్సిందే
● 300 ఎకరాల భూములు ఎలా సాగు చేయాలి
● ప్రాజెక్ట్ అధికారులను ప్రశ్నించిన రైతులు, వ్యవసాయ కార్మికులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సాగరమాల ప్రాజెక్ట్ జాతీయ( నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) రహదారిపై సోమవారం ఈపూరు బిట్-1ఏ పరిధిలోని దొరువులపాలెం గ్రామపంచాయతీ రైతులు, వ్యవసాయ కార్మికులు ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిలో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారి మార్గాన్ని నిర్మిస్తున్న సందర్భంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కారం చేయాలని గత ఆరు నెలలుగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో చివరకు విసుగు చెందిన రైతాంగం జాతీయ రహదారి పైన నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు.



షామియానాలు ఏర్పాటు చేసుకుని రెండు గంటలపాటు నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వాలు పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్వేనెంబర్ 596లో డొంక భూమిగా తొమ్మిది ఎకరాలు ఉంది. సాగర మాల ప్రాజెక్ట్ రహదారి నిర్మాణం కాకముందు నుంచి ఈ మార్గం ద్వారా రైతులు పంట పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకుని జీవించేవారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం వల్ల ఈ డొంక మార్గం ద్వారా పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా రహదారి నిర్మాణం చేస్తూ ఉన్నారు. కనీసం సర్వీస్ రోడ్డు నుంచి కూడా రైతులను పొలాల్లోకి వెళ్ళనీయకుండా ఇబ్బందులు పెడుతుండగా సహనం కోల్పోయిన రైతులు చివరకు రోడ్డుపైకి వచ్చారు. తమ పొలాలకు వెళ్లేందుకు దారి సదుపాయాన్ని కల్పించాలని తమకున్న డొంక మార్గాన్ని యధాతథంగా ఉంచుతూ ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, రైతులు, వ్యవసాయ కార్మికులు వెళ్లేందుకు వీలుగా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేసిన ఆందోళన ప్రాజెక్టు అధికారుల గుండెల్లో వణుకు పుట్టించింది. సర్వేనెంబర్ 596లో సుమారు తొమ్మిది ఎకరాలు డొంకభూమి ఉందని రైతులు మీడియాకు చెప్పారు. రహదారి నిర్మాణం చేస్తూ సర్వీస్ రోడ్డు వెంబడి డ్రైనేజీ కాలువ నిర్మాణం నిర్మించుకుంటూ దారి మార్గాన్ని మూసివేస్తున్నారని అలాంటప్పుడు రైతులు వ్యవసాయం ఏ విధంగా చేయాలని రైతులు ప్రశ్నించారు. రైతులు అడ్డుపడితే పనులు చేయకుండా ఉన్నారని ఆందోళన చేయకుండా ఉండిపోతే పనులు చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సిద్ధంగా ఉన్నారని రైతులు విమర్శించారు. మా భూములకు వెళ్లేందుకు దారి కావాలి అంటూ పెద్ద ఎత్తున రైతులు వ్యవసాయ కార్మికులు రోడ్డుపై నుంచి నినాదాలు చేశారు.

### రైతులతో చర్చలు జరిపిన ప్రాజెక్ట్ అధికారులు

రోడ్డుపై కూర్చుని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని విషయం తెలుసుకున్న ప్రాజెక్ట్ అధికారులు, కాంట్రాక్టర్లు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి రైతులు ఇసనాక సతీష్‌రెడ్డి, ఇసనాక దయాకర్ రెడ్డిలు నేతృత్వం వహించారు. కేవలం రైతు ఉద్యమంగా శాంతియుతంగా చేశారు. ఈ చర్చల్లో రైతులకు అధికారులకు మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. సర్వీస్ రోడ్డు నుంచి కూడా రైతులను అనుమతించకుండా అడ్డుపడడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. రెవెన్యూ ప్లాన్, రికార్డు ప్రకారం పొలాల్లోకి సజావుగా వెళ్లే విధంగా దారి వదిలివేస్తూ సౌకర్యం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. 300 ఎకరాల భూములు బీడు భూములుగా మారాలా అంటూ రైతులు నిలదీశారు. ప్రాజెక్ట్ అధికారులు అదే విధంగా కాంట్రాక్టర్లు సమాధానం చెప్పుకోలేక మానం వహించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇచ్చిన డ్రాయింగ్ ప్రకారం పనులు చేస్తున్నామని అధికారులు సమాధానం చెప్పడంతో రైతులు అసహనం చూపారు. అభివృద్ధి ఎంత ముఖ్యమో రైతు సంక్షేమం కూడా అంత ముఖ్యంగా చూడాలని అన్నారు. ప్రస్తుతానికి పనులు నిలిపివేస్తా మని ప్రాజెక్ట్ అధికారులు చెప్పగా ఆ విషయం పక్కన పెట్టి దారి బాగు చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులు అడిగారు. సమస్యను పరిష్కరిస్తామని రైతులకు న్యాయం చేస్తామని ప్రాజెక్ట్ అధికారులు సమాధానం చెప్పడంతో రైతులు తాత్కాలికంగా ఆందోళన విరమణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదు

## ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి - రాచర్లపాడు ఛానల్ పనులను నాసిరకంగా నిర్మిస్తూ పాత ప్రతిపాదలను తుంగలో తొక్కి, అధికారుల లేక నాయకుల స్వలాభం కోసం ప్రతిపాదనలను మార్చి రైతులకు అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు తమ ఆవేదనను వ్యక్త పరిచారు. సోమవారం కావలిలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ని కలిసి విషయాన్ని సవివరంగా వివరించి, వినతిపత్రాన్ని అందించారు. అనంతరం చైర్మన్ మాలేపాటి మాట్లాడుతూ.. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ప్రతిపాదనలను గంగలో కలిపి ప్రస్తుతం చేస్తున్న పనులు నాసిరకంగా రైతులకు అన్యాయం జరిగేలా ఉన్నాయని తెలిపారు. ఒక రైతుగా.. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. రైతులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనని, దీనిపై ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళుతున్నానని అంతేకాకుండా ఈ విషయంపై సోమవారం తిరుపతిలోని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ని, నెల్లూరులోని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, పే అండ్ అకౌంట్, ఇరిగేషన్ సూపరింటెండెంట్‌ని కలిసి అర్జీలను సమర్పించడం జరిగిందని అదేవిధంగా పత్రికా విలేకర్ల సమక్షంలో కావలి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కలిసి విషయాన్ని కూలంకుషంగా వివరించి వినతిపత్రాన్ని అందించారు, తక్షణమే అధికారులు స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాలతోపాటు 23 గ్రాముల రైతులకుగాను 23వేల ఎకరాల పంట పొలాలు బీడు భూములుగా మారనున్నాయని, రైతుల కడుపు కొట్టడానికి ఇటువంటి పనులు చేపడుతున్నారని తెలిపారు. గతంలో ఎంతో కష్టపడి ఈ కెనాల్ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద కష్టపడి ప్రతిపాదనలు మంజూరు చేయించామని, కానీ గత వైసిపి ప్రభుత్వంలో దానిని నిర్వీర్యం చేశారని, మరలా ఇప్పుడు తెలుగుదేశం పార్టీ హయాంలో కూడా ఇటువంటి నాసిరకంగా రైతులకు నష్టము జరిగే పనులు చేస్తుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, రైతుల కొరకు దేనికైనా ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే ఇక్కడ అధికారులు చేస్తున్న పని ఏమిటి.. అని మాలేపాటి ప్రశ్నించారు. తక్షణమే డిఆర్ ఛానల్ నిర్మాణ పనుల్లో జరిగే అవకతవకలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి రైతుకులకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# శరీరంలో కళ్ళకు ఉన్న ప్రాధాన్యత అమూల్యమైనది



- సర్వేంద్రియానం నయనం ప్రధానం
- 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు
- జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం.శార్వాణి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మానవుని శరీరంలో అత్యంత ప్రాధాన్యమైనవి నేత్రాలు అని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం.శార్వాణి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం బుజబుజనెల్లూరులోని డివిఎన్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ శార్వాణి పాల్గొని మాట్లాడుతూ.. శరీరం నయనం ప్రధానమని, నేత్రదానం యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు అవగాహన సదస్సులు, ర్యాలీలు, వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, సహృదయులైన దాతలు అందించే నేత్రదానంతో ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన పుణ్యఫలం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. నేత్రదానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. నేత్రములోని ముందుగల నల్లని భాగాన్ని కప్పుతూ ఉంచే పలుచని పొరను కార్నియా అంటారని, దానిని మాత్రమే స్వీకరించి చూపులేని వారికి నేత్రాలను అమరుస్తారని అన్నారు. నేత్రాలను మరణానంతరం మాత్రమే స్వీకరిస్తారని, నేత్రదానాన్ని అన్ని మతాలవారు ఆమోదించాలన్నారు, మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయవలసి ఉంటుందని, అందువలన దగ్గరలోని కంటి బ్యాంకుకు కబురు పెట్టడంలో జాప్యం చేయవద్దని, మీరు సకాలంలో నేత్రదానం చేయగలిగేలా చూడడంలో ముఖ్య భూమిక నిర్వహించగలరని అన్నారు. మీ కుటుంబంలో గానీ లేదా మీకు బాగా తెలిసిన కుటుంబంలో గానీ దురదృష్టవశాత్తు ఎవరైనా మరణానంతరం దగ్గరలోని కంటి బ్యాంకు వారికి తెలియజేయడం మర్చిపోకండి అని అన్నారు. మరణించిన వ్యక్తి తన నేత్రాలను దానం చేస్తున్నట్లు ఇదివరకే ప్రతిజ్ఞ చేసిన, చేయకపోయినా సరే ఆ కుటుంబం వారి అనుమతితో కూడా కళ్ళను తీసుకోవచ్చునన్నారు. అనంతరం డాక్టర్ శార్వాణిని పాఠశాల సిబ్బంది శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు మేరీ మంజుల, మల్లికార్జున, లక్ష్మీ ప్రసన్న, రాధిక, ఉష, శైలజ, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, కె.రామరాగవయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ.. భాష్ స్నేహానికి నెటిజన్లు ఫిదా



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వంగమూరులో తన స్నేహితుడైన మీరామహుద్దీన్ అనేవ్యక్తి టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తన వృత్తితోనే బిడ్డలను పోషించుకుంటున్నారు. అయితే తన కుమార్తె వివాహం కుదరడంతో తమ ఆర్థిక పరిస్థితి విషయంపై కొంచెం ఆందోళన చెందుతున్న సమయంలో తన స్నేహితులైన ఎం.సుధాకర్‌రెడ్డి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడి ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో తను కావలికి వచ్చినప్పుడు ఈ విషయాన్ని మీరా మోహిద్దీన్ తన స్నేహితుల దగ్గర తెలపడంతో స్నేహితులు అయిన ఆర్కే శేషారెడ్డి, లాయర్ నాగేంద్రబాబు, ఎం.సుధాకర్ రెడ్డి, బి.రాజేంద్ర ప్రసాద్ సాఫ్ట్‌వేర్ బృందం మరి కొంతమంది స్నేహితులు కలిసి తన కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయాన్ని వారి గ్రామమైన ముంగమూరుకు వెళ్లి వారి వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ విషయాన్ని ఆ గ్రామంలోనే పట్టణ ప్రజలు, ఇతరులు శ..భాష్ తమ స్నేహితునికి అందించిన ఆర్థిక సహాయానికి నెటిజన్లు ఫిదా అవుతునన్నారు. అంటున్న నేటిజన్ల ఇలాంటి స్నేహితులు ఈ రోజుల్లో కూడా ఉన్నారా.. అని వారిలో వారు అనుకోవడం విశేషం. ఏది ఏమైనప్పటికీ ఇలాంటి ఆర్థిక సహాయాలు చేసినప్పుడు భారంలో ఉన్న స్నేహితులకు కొంత ఊరట నిచ్చినట్లు అవుతుందని నెటిజెన్లు ఆలోచిస్తున్నారు.

# 26వ డివిజన్‌లో ఫించన్లు పంపిణీ



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని 26వ డివిజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక కార్పొరేటర్ బూడిద పురుషోత్తం యాదవ్ సూచన మేరకు టిడిపి నాయకులు మాధవి, చాన్‌బాషలు ఆ సచివాలయం అడ్మిన్ కార్యదర్శి అబ్దుల్ జబ్బర్‌తో కలిసి బిట్ 2లోని డ్రైవర్స్ కాలనీలోపంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

# ఉదయగిరి జిల్లా ఏర్పాటు చేయండి

- తహశీల్దార్ ద్వారా ప్రభుత్వాన్ని కోరిన గణపం



**వింజమూరు మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు కొత్త జిల్లాల పేర్ల మార్పులు చేయడం సరిహద్దులు చేర్పులు మార్పులు చేయడానికి అధ్యయనం చేయడం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించడం జరిగింది. ఇందులో భాగంగా మంత్రివర్గ ఉప సంఘం ఏమైనా సూచనలు సలహాలు ప్రజలు, ప్రజాప్రతినిధులు నుండి అర్జీ రూపంలో ఇవ్వమని కోరారు. వెనుకబడిన అనాదిగా నిర్లక్ష్యానికి నిరాదరణకు గురైన ఉదయగిరి ప్రాంతాన్ని జిల్లా చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వింజమూరు జడ్పీటిసి గణపం బాలకృష్ణారెడ్డి కోరారు. కాబట్టి ప్రభుత్వం చేపట్టిన క్రొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నెల్లూరు, ప్రకాశం కడపలోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా చేయాలని తహశీల్దార్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు వైసీపీ నాయకులు కడియాల సురేష్, గణపం రమేష్ రెడ్డి, సూరం వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## దళిత రైతులపై అధికారి..

# నిరంకుశ వైఖరిని ఖండిస్తున్నాం : సీపీఎం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం మొలకలపూండ్ల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 500-2,1 పరిధిలోగల పొలంలో వెంకటేశ్వర్లు, శంకరయ్య, పెంచలయ్య, నిమ్మ సాగు చేసుకుంటున్నారూ వీళ్లు గత 16 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో గత పది రోజుల నుండి దళిత రేతులపై పోలీసులు, అధికారులు వచి ఇబ్బందులు గురి చేయడం సరికాదని స్థానిక ఎమ్మార్వో సుభద్రని కలిసి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దళితుల పొలాలను అప్పగించాలని తెలియజేశారు గతంలో ఉన్న తహసిల్దార్ వీళ్లకు పట్టాలను మంజూరు చేయడం జరిగింది. కానీ ఇప్పుడు ఈ తహసిల్దార్ నాకు సంబంధం లేదు అని చెప్పడం విడ్డూరంగా ఉందని మంజూరు చేసిన మండల అధికారులు ఇప్పుడు సంబంధం లేనట్టుగా వ్యవహరించడం ఖండిస్తున్నామని తెలియజేశారు. దళిత పొలాల జోలికి వస్తే ఊరుకోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంచేటి, శ్రీనివాసులు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గంగాధర్ సిఐటియు నాయకులు, చింతగుంట శ్రీనివాస్, రైతులు భాగ్యమ్మ, వెంకట రమణమ్మ, లక్ష్మమ్మ, పార్వతి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరిని జిల్లా చేయాలంటూ జేవీవీ వినతి

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు కొరకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్న తరుణంలో నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిని జిల్లాగా గుర్తించాలంటూ మర్రిపాడు మండల జనవిజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లాగా గుర్తిస్తే అభివృద్ధి ప్రాంతంగా మెరుగుపడుతుందని తెలిపారు. దీంతోపాటుగా నిరుద్యోగులు సైతం ఉద్యోగస్తులుగా మారి ఎన్నో పేద కుటుంబాలు ఉపాధి పొందుతాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక వెనుకబడి ప్రాంతంగా దర్శనమిస్తున్న తరుణంలో జిల్లాగా ప్రకటిస్తే మెట్ట ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని తెలిపారు. ఎటువంటి జల వనరులు లేని ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో వ్యవసాయానికి దూరమై వలసలు వెళ్లి కుటుంబాలను పోషించాల్సి వస్తుందన్నారు. ఇటువంటి తరుణంలో ఉదయగిరిని జిల్లాగా మారిస్తే అటు వలసలు ఇటు నిరుద్యోగం అరికట్ట వచ్చునని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఉదయగిరి ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని కోరారు.



అందుకు జిల్లాలోని మంత్రులైన పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణరెడ్డిలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొక్కంటి పోలయ్య, మండల అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షులు కుంభగిరి వేణుగోపాల్, కమిటీ సభ్యులు బొర్రా వెంకటసుబ్బారెడ్డి, ప్రభాకర్, కత్తి పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.



# దొరసానమ్మ గంధమహోత్సవం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాములవారి ధర్మపత్ని శ్రీ హబీబా ఖాతూన్ అమ్మజాన్ దొరసానమ్మల 252వ గంధ మహోత్సవం ఆదివారం తెల్లవారుజామున రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గంధంను ముందుగా సుగంధ ద్రవ్యాలు అత్తరు పన్నీరులతో కలిపి గంధ కలశంను దర్గా వంశస్తుడైన ఎస్‌జిఎన్ ఫయాజ్ అహ్మద్ తలపై ఉంచుకొని మహల్ నుండి ఊరేగింపుగా మేళ తాళాలతో భక్తి కీర్తనలతో ఫకీర్ల జరుబులతో బాణాసంచా కాలుస్తూ కొబ్బరి దివిటీల, భక్త జన సందోహం నడుమ హజ్రత్ వారి దర్గాకు చేర్చారు అక్కడ హజరత్ అమ్మవార్ల సమాధులకు గంధ లేపనం చేసి ప్రత్యేక ఫాతేహాసలాములు పాడి గంధంను భక్తులకు పంచి పెట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంధం అందించడానికి రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆదేశానుసారం దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో అదనపు గంధ బిందెలను ఏర్పాటు చేసి భక్తులకు పంచిపెట్టారు. గంధ మహోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు హాజరయ్యారు ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఆత్మకూరు డిఎస్పీ కే.వేణుగోపాల్, సంగం సిఐ కే.వేమారెడ్డి, స్థానిక ఎస్ఐ ఏ.సైదులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మార్కెటింగ్ కమిటీలలో బీసీల హక్కులను కాపాడాలి

## బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకే కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు జిల్లా కలెక్టర్ ఆనంద్ కు విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ కేటాయింపులలో ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ బీసీలకు కేటాయింపబడింది. 14.8.2025 నెల్లూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీలకు కేటాయించిన రిజర్వేషన్ ఉత్తర్వులు వెలువడిన తర్వాత అగ్రవర్ణ రాజకీయా నాయకుల ఒత్తిడితో బీసీలకు కేటాయించిన ఉదయగిరి ఏఎంసిని అదే 14వ తేదీ ఓసీలకు కేటాయిస్తూ.. మరో ఉత్తర్వులు కలెక్టర్ జారీ చేశారు. బీసీలకు అంది వచ్చిన రిజర్వేషన్లను చట్ట వ్యతిరేకంగా అగ్రవర్ణ పాలకుల మూలంగా కోల్పోతున్నామని గ్రహించిన జలదంకి ఎంపీటీసీ కుట్టుపోయిన మాధవరావు యాదవ్ రాష్ట్ర హైకోర్టు నుండి మధ్యంతర ఉత్తరములు తీసుకువచ్చారు. రిజర్వేషన్లు రాజకీయ ఒత్తిడిలతో మార్పులు చేయడం వలన బీసీలు నష్టపోతున్న అంశాలను బీసీ సంక్షేమ సంఘం నేతలు కలెక్టర్కు



వివరించారు. ఉదయగిరి ఏఎంసి విషయంలో బీసీలకు అన్యాయం జరగకుండా చూడాలని బీసీ నేతలు కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వంలో కూడా బీసీల పట్ల అణచివేత ధోరణి కొనసాగుతుందని అర్థమైంది. బీసీ సంక్షేమ సంఘం నాయకులు సమాధి శ్రీనివాస్ యాదవ్, లలితారం యాదవ్‌లతోపాటు హైకోర్టు నుండి మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చిన కుట్టుబోయిన మాధవరావు యాదవ్‌లు కలెక్టర్‌ని కలిసిన వారిలో ఉన్నారు.

# కాంగ్రెస్ ఎంపీలపై కేసులు నమోదు చేయండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రాహుల్ గాంధీ, మొయిత్రలపై కేసులు నమోదు చేయాలని చిన్న బజార్ సీఐ కోటేశ్వరరావుకు బిజెపి నేతలు ఫిర్యాదు చేశారు. ఓట్ అధికార యాత్రలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యాఖ్యానించారు. ఒక గల్లీలో కార్యకర్తల నినాదాలతో కార్యకర్తలను రెచ్చగొట్టారు. రాహుల్ నినాదాలకు రెచ్చిపోయిన కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ రిజ్వీ మోడీ తల్లిని అనకూడని మాటలు అన్నారు. ఆ మాటలకు భారతీయ మహిళలందరూ బాధపడుతుంటే ఇప్పటికీ కూడా రాహుల్ గాంధీ గాని మహిళ అయిన ప్రియాంక గాంధీ గాని పశ్చాత్తాప ప్రకటన కూడా చేయలేదు. ఈ వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ మౌనంగా ఉండడం దేశంలో మహిళలను అగౌరపరచడమే అవుతుంది. తృణమూల్ ఎంపీ మొయిత్ర హెూం మంత్రి అమిత్‌షా తలకోసి బల్ల మీద పెట్టండని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశీయుల అక్రమ వలసల విషయంలో అమిత్‌షా విఫలమైనందున తలకోసేయమన్నారు. ఆమె వ్యాఖ్యలు వలన 1971లో బంగ్లానుండి శరణార్థులుగా వచ్చిన హిందువులపై ప్రభావం చూపుతుంది. వారందరూ అభద్రత భావానికి లోనై ఉన్నారు. రెచ్చగొట్టి హింసను ప్రేరేపించేలా మొయిత్రా వ్యాఖ్యలు ఉన్నందున కేసులు నమోదు చేయాలని బిజెపి నేతలు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, నరాల సుబ్బారెడ్డి, పొట్లూరు శ్రీనివాసులు ఉన్నారు.

## సమీవుల్లా కుటుంబాన్ని పరామర్శించిన కొండా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని కంసాల వీధిలో విద్యుత్ ఘతానికి గురై సమీవుల్లా అనే బాలుడు మృతి చెందిన సంఘటన విధితమే విషయం తెలుసుకున్న వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి సోమవారం బాలుని కుటుంబ సభ్యులను కలుసు కొని ధర్యం చెప్పి 10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లోదాసరపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ మాజీ సొసైటీ అధ్యక్షులు కే.రమణారెడ్డి నారపరెడ్డి మాజీ ఉపసర్పంచ్ కారు దుంప వెంకట రమణయ్య మాజీ సర్పంచపెరుమళ్ళ వెంకటసుబ్బయ్య దస్తగిరి, అహ్మద్ షంషేర్, సలీం, టింకర్ బాబు, గురవయ్య, గోగుల రామయ్య, బసిరెడ్డి కృష్ణారెడ్డి, మట్ల హరి, ఇత్తడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం.. నిరసన



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అసభ్య వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఘనమైన నిరసన కార్యక్రమం జరిగింది. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సుభాషిని ఆధ్వర్యంలో, గాంధీ బొమ్మ వద్ద నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా నడుచుకుంటూ వెళ్ళి, అనంతరం ఇందిరా భవన్ ముందర రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన నాయకులు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి కుటుంబంపై కాంగ్రెస్ పార్టీ నేతలు ఉపయోగించిన అసభ్య పదజాలాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయని, వెంటనే కాంగ్రెస్ పార్టీ అధికారికంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు కందికట్ల రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకసిరి ఫణిరాజు, యశ్వంత్‌సింగ్, చిలకా ప్రవీణ్, డి.శ్రీనివా సులు, కుప్పా ప్రసన్న, చిలకల ప్రవీణారెడ్డి సుమతి, పద్మ, అశోక్ నాయుడు, మదన్ సాయిరెడ్డి, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ.. దేశ గౌరవాన్ని దెబ్బతీసే కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రజలు తిరస్కరించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

## ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లిం చాలని సోమవారం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు ఆవాజ్ మండల కమిటీ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్ మాట్లాడుతూ.. ప్రతినెలా వారికి గౌరవ వేతనం చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల కాలంలో ఒకసారి మాత్రమే 6 నెలల గౌరవ వేతనం ఇచ్చిందన్నారు. తొమ్మిది నెలలుగా ఇమామ్ మౌజన్లకు వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిపెస్లోలో 50ఏళ్ళు దాటిన బీసీలకు పించన్ ఇస్తామని ప్రకటించిందని, ఇంతవరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనాలు చెల్లించడంతోపాటు 50 ఏళ్ల దాటిన బీసీలకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలికి సన్మానం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** అనుమసముద్రం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) నందు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసినటువంటి తాటిపర్తి రాజేశ్వరిని ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని విద్యాశాఖ కార్యాలయంలో తాటిపర్తి రాజేశ్వరి శాలువాలు కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎం.జ్యోతి, డి.సాయి ప్రసాద్ మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తాటిపర్తిరాజేశ్వరికి శాలువా పూలమాలతో సన్మానించారు. సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ బృందం రాజేశ్వరి ఉద్యోగ సేవలను గురించి కొనియాడారు.

# పెద్దపవని రైల్వే ఓవర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలి

## ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని పెద్ద పావని రోడ్డు వైకుంఠపురంలో సుమారు 15 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సోమవారం ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక వారు ఆర్డీఓకి వినతిపత్రాన్ని అందించారు. కావలి నియోజకవర్గానికి ఎంతోమంది ఎమ్మెల్యేలు మంత్రులు ఉంటూ వస్తు పోతూ ఉన్నారు కానీ పక్కనే ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి వలన సుమారు 100 గ్రామాల ప్రజలు రాకపోకలకు రవాణాకు అవసరమైన ఈ బ్రిడ్జిని పూర్తి చేయాలని, అనేక రకాలుగా వ్యాపారస్తులు పాదాచార్యులు ద్విచక్ర వాహనదారులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరి ఎందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం జరుగుటలేదు ప్రజల కష్టాలు ప్రభుత్వానికి తెలియడం లేదా.. లేక ఈ బ్రిడ్జి ఎవరికైనా స్వలాభం ఉందా అనే ఆలోచన ప్రజల్లో ఉందని వారు తెలిపారు. అంతేకాకుండా పట్టణంలోకి రావాలంటే చుట్టూ తిరగడం వలన ఆటోలకు అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని, ఏదైనా అత్యవసర చికిత్స కోసం వైద్యశాలకు రావాలన్న చాలా సమయం పడుతుందని, కావలి పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఈ బ్రిడ్జి పూర్తయితే తగ్గిపోతుందని పట్టణ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. అంతేకాకుండా ఉదయగిరి బ్రిడ్జి ఈ భారీ వాహనాల రాకపోకలు కూడా విపరీతంగా తిరగడం వల్ల ఇక్కడ ట్రాఫిక్ కాకుండా ఉదయగిరి పై ఓవర్ బ్రిడ్జి కూడా పగుళ్లతోనూ బ్రిడ్జి మన్నిక కాలం కూడా తగ్గిపోయే దానికి కూడా అవకాశం ఉందని, ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రజలు పడుతున్న కష్టాలను. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ బ్రిడ్జిని పున్నమించేందుకు ప్రయత్నాలు సాగించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్వది భాస్కర్, ధామ అంకయ్య, ఎర్రంశెట్టి కృష్ణ మోహన్, బోసు, దర్గాబాబు, ఆమంచి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిస్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలి : సీపీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నిరుపేదలైన వారికి ఇంటినివేశనస్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు కోరారు. జిల్లా సిపిఐ సహాయకార్యదర్శి యామల మధు ఆధ్వర్యంలో రాష్ట్రకమిటీ పిలుపుతో సోమవారం స్తానిక మున్సిపల్‌కమీషనర్ సి.గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యామాల మధు మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా అర్జీలిచ్చామన్నారు. ఎన్నికల ముందు కూటమినేతలు తాము అధికారంలోకి వస్తే అర్హులైన పేదలకు గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటినివేశనస్థలాలిస్మామని హామీ ఇచ్చారని, కూటమి అధికారంలోకి వచ్చి 14నెలలు గడిచినా ఇంటిస్థలాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. అధికారంలోకి రాకముందు తాము ప్రజలకోసం పనిచేస్తామన్న కూటమినేతలు అధికారంవచ్చాక ప్రజాపక్షాన పనిచేయడం లేదని ఆయన విమర్శించారు. ఇంటిస్థలాలిచ్చి 5లక్షల రూపాయలతో ఇళ్ళను నిర్మిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆమేరకు నిధులు ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తాము ప్రజాఉద్యమానికి సిద్దమవుతామని మధు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, సిపిఐ అనుబంధ మున్సిపల్ కార్మికసంఘ నాయకులు హజరత్తయ్య, చెంచయ్య, నాగేంద్ర, ఎన్.కొండయ్య, మాలకొండయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రమంతప్పకుండా పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాలవ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుందని, తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, పెన్షనర్లపట్ల ఉన్న అభిమానం, ఆదరణకు నిలువెత్తు సాక్ష్యమని, 1వ తేదీ సెలవుదినమైతే ముందురోజే పంపిణీ చేస్తున్నామని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రాతకాలం నుండే ఆయన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది తోపాటు ఆయన ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో 200రూపాయల పెన్షన్‌ను 2వేలరూపాయలకు పెంచారని, గత ప్రభుత్వం ఐదేళ్ళపాటు 250వంతున 3వేల రూపాయలకు పెంచగా చంద్రబాబు పదవిచేపట్టగానే నాలుగు వేలకు పెంచడంతోపాటు మూడునెలల అరియర్స్‌ను కూడా కలిపి ఇళ్ళవద్దనే పంపిణీ చేయించారని పేర్కొన్నారు. నెల మొదటి రోజు సెలవుదినమైతే ముందురోజే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధితోపాటు అందరికీ ప్రతినెలా 1వ తేదీ నాడే పెన్షన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానుసారం, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్లవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని తోడేటి పేర్కొన్నారు. కాగా ఆత్మకూరు మండలంలోని అన్నిగ్రామాల్లో, మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చంద్రబాబు సిఎం ప్రమాణస్వీకార దినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మూడుదశాబ్దాల క్రితం ముఖ్యమంత్రిగా ప్రప్రథమంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజుగా సోమవారం ఆత్మకూరులోని 20వవార్డులో కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భాస్కరరెడ్డి వార్డులో ప్రజలకు స్వీట్లు పంచిపెట్టి ఆనందోత్సాహాల మద్య వేడుకలను నిర్వహించారు. నాడు ప్రథమంగా ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు అనంతరం దపదపాలుగా సిఎం పదవిని అధిష్టించారని సూరా భాస్కరరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు అపారఅనుభవాన్ని గడించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, నేడు విభజిత ఆంధ్రప్రదేశ్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, అబివృద్ధి, సంక్షేమం రెండుకళ్ళుగా అన్నివర్గాల సంక్షేమానికి, అన్నిప్రాంతాల అభివృద్ధికి ఇతోధికంగా చంద్రబాబు కృసిసాగిస్తున్నారని భాస్కరరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళులుండగా ఆత్మకూరు అభివృద్ధిప్రదాత, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈనియోజకవర్గాన్ని అనూహ్యంగా అభివృద్ధిలో పరుగులు తీయిస్తున్నారని సూరా పేర్కొన్నారు. విభిన్న, రెబల్, డేరింగ్, డేషింగ్ కౌన్సిలర్‌గా పేరుగాంచిన సూరా భాస్కరరెడ్డి ఈ వేడుకలను నిర్వహించిన అనంతరం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ టిడిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నాగులూరు చిన్నబ్బయ్య, తెలుగుదేశం నాయకులు గుర్నాధం శ్రీనయ్య, యు.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య మృతదేహానికి నివాళి : టీడీపీ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు పంచాయతీ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నందిపోగు బాలయ్య మృతి తీరని లోటు అని టీడీపీ మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు అన్నారు. సోమవారం బాలయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలయ్య అంత్యక్రియలకు టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రావు 5వేలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పొద మాధవరావు 5వేలు, మాజీ సర్పంచ్ ఆంద్రా బాల గురువారెడ్డి 5వేల రూపాయలు చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. వారి వెంట మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, లింగం మాలకొండయ్య, ఆంద్రా శివరామిరెడ్డి, చంచల బొజ్జయ్యలు నివాళులర్పించారు.

## స్కూల్‌బస్, మోటర్‌బైక్ ఢీ.. భర్త మృతి, భార్యకు గాయాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఆత్మకూరు మండలం కరటంపాడు వద్ద సోమవారం సాయంత్రం ఒక స్కూల్‌బస్సు, మోటర్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ఆయన భార్యకు గాయాలయ్యాయి. ఉదయగిరికి చెందిన భార్యభర్తలిరువురు నెల్లూరు నుండి స్వగ్రామానికి మోటర్‌సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్కూల్ బస్సు మలుపు వద్ద నుండి రోడ్డుపైకి వస్తున్నక్రమంలో నెల్లూరునుండి భార్యాభర్తలు వస్తున్న మోటర్‌సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా భార్యకు తీవ్రగాయాలు కాగా చికిత్సకై ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆత్మకూరు ఎస్ఐ షేక్ జిలానీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## నూతన విద్యుత్‌స్థంభం ఏర్పాటు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఒక విద్యుత్‌స్థంభం శిథిలమై కూలే పరిస్థితిలో ఉండగా సోమవారం ఆస్థంభంను తొలగించి నూతన స్థంభాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని పెద్దమశీదు ఎదురుగా బ్రాహ్మణవీధిలో గతంలో ఎప్పుడో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్‌స్థంభం దెబ్బతిని శిథిలావస్థకుచేరుకొని ఎప్పుడు కూలుతుందోనని ఆప్రాంతీయులు ఆందోళన చెందసాగారు. ఈవిషయం తెలుసుకున్న పట్టణ విద్యుత్ ఏఈ జమీలాబేగమ్ స్పందించి హుటాహుటిన ఆప్రదేశాన్ని పరిశీలించి వెంటనే నూతన స్థంభాన్ని ఏర్పాటు చేయించారు. అక్కడి ప్రజలు ఏఈ జమీలాబేగమ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్వామి వారి అనుగ్రహంతోనే లంబోదర లడ్డు దక్కింది

- తేజస్విని గ్రాండ్ అధినేత తోట శ్రీనివాసులు రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** గణేషుని ఆశీస్సులతో తమకు మరోసారి లంబోదర లడ్డు దక్కిందని తేజస్విని గ్రాండ్, తేజు డెవలపర్స్ అధినేత తోట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని తేజస్విని గ్రాండ్‌లో సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలోని అత్యంత వైభవంగా జరిగిన లంబోదర గణేశుడు లడ్డూను సొంతం చేసుకునేందుకు అనేకమంది పోటీ పడ్డారన్నారు. తాము గత ఏడాది రూ.8.10 లక్షలకు లడ్డును పాడుకున్నామని, ఈ ఏడాది పోటీపడి రూ.13.50 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నామన్నారు. గత ఏడాది తమకు వ్యాపార పరంగా, ఆరోగ్యపరంగా లంబోదర లడ్డు ఎంతగానో కలిసి వచ్చిందన్నారు. లడ్డూలు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, తమ కస్టమర్లకు, జిల్లా ప్రజలకు పంచి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో తేజస్విని గ్రాండ్ డైరెక్టర్ కేదార్ తేజు డెవలపర్స్ కో- ఆర్డినేటర్ రాధాకృష్ణారెడ్డి, తేజు డెవలపర్స్ డైరెక్టర్ పెంచల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా

# అవగాహన కల్పించండి : కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార, అక్రమ లేఔట్లలోని ప్లాట్ల యజమానులు యాజమాన్యపు హక్కులను పొందేందుకు పట్టణ ప్రణాళిక విభాగం అందుబాటులోకి తెచ్చిన ఎల్.ఆర్.ఎస్. మార్గదర్శకాలపై లే అవుట్ల యజమానులకు అవగాహన కల్పించి, పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనధికార, అక్రమ నిర్మాణాలను నగర వ్యాప్తంగా గుర్తించి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-4, హౌసింగ్ - 18, టౌన్ ప్లానింగ్-10, రెవెన్యూ-9, పబ్లిక్ హెల్త్-4, ఆప్కాస్-5, అకౌంట్ సెక్షన్-1, మొత్తం-51 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, హిమబిందు, టిపిఆర్ఓ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ పిజిఆర్ఎస్కు 79 ఫిర్యాదులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా 79 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య ఫిర్యాదు దారుల నుంచి వినతులు స్వీకరించి, ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆమె ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి సిహెచ్. రామారావు, లీగల్ అడ్వైజర్ టి. శ్రీనివాసులు రెడ్డి, ఎస్బి-2 సీఐ బి శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వచ్చిన ఫిర్యాదులో కొన్ని..

- కలిగిరి పరిధికి చెందిన వ్యక్తిని, రెడ్డి మ్యాట్రిమోనియల్ ప్రొఫైల్లో కీర్తి రెడ్డి అనే మహిళ పరిచయం చేసుకొని, క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఆశ చూపి నమ్మించి 14లక్షల 50వేల రూపాయలు నగదు పెట్టుబడి పెట్టించి తర్వాత ఎటువంటి ఆదాయం కనిపించకపోతే విచారించగా నకిలీ పోర్టల్ అని తెలుసుకొని మోసపోయానని, అదేవిధంగా కావలి టూ టౌన్ పరిధికి చెందిన వ్యక్తిని, ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ మార్కెట్లో కువేర అనే కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మి 50 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయానని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నవాబ్ పేట పరిధికి చెందిన వ్యక్తికి బ్యాంక్ లో లోన్ ఇప్పిస్తానని విజయ కుమార్ అనే వ్యక్తి హైదరాబాదుకు చెందిన కంపెనీలో పనిచేస్తున్నట్లు పరిచయం చేసుకొని, 10 లక్షలు లోన్ కొరకు, అప్పుడప్పుడు 18 లక్షలు వరకు కట్టించుకున్నాడని, లోన్ వద్దు రద్దు చేసుకుంటానని చెప్పగా, మరో 80వేలు ఇస్తే రద్దు చేస్తామని బెదిరించినట్లు, నేను కట్టిన నగదు ఇవ్వట్లేదని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- అల్లూరు పరిధికి చెందిన ఫిర్యాది యొక్క తమ్ముడిని టిప్పర్ వాహనం యాక్సిడెంట్ చేసిన కారణంగా బలమైన గాయాలు తగిలి హాస్పిటల్ లో ఉన్నట్లు, కేసు నమోదైనట్లు, యాక్సిడెంట్కి కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.
- వెంకటాచలం పరిధికి చెందినటువంటి 80 సంవత్సరాల వృద్ధుని, తన పెద్ద కుమార్తె ప్రమీల, భర్త శ్రీనివాసులు తన దగ్గర జీవనోపాధి కోసమని మూడు లక్షలు నగదు తీసుకొని తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.
- దర్గామిట్ట పరిధికి చెందిన మహిళ యొక్క కుమార్తె గత నెల నుండి కనిపించడం లేదని, కేసు నమోదు చేసినట్లు, నా కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.
- బుచ్చి పరిధికి చెందినటువంటి మహిళను గతంలో తన భర్త మానసికంగా శారీరకంగా వేధిస్తుంటే బుచ్చి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు, నెలరోజుల నుండి నన్ను వెంబడిస్తూ తన మీద పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలని లేకపోతే నీ అంత చూస్తానని బెదిరిస్తున్నాడని విచారించి అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందినటువంటి మహిళను తన భర్త తాను అనారోగ్యంగా ఉందని అసలు పట్టించుకోవడం లేదని, అంతేకాకుండా తనకు హక్కుగా ఉన్న ఇంట్లో వాటా ఇవ్వాలని వేధిస్తూ బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

# అద్దె చెల్లించని షాపును సీజ్ చేసిన ఆర్ఐలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన స్థానిక చిన్న బజార్ ప్రాంతంలోని ఏసీ సుబ్బారెడ్డి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ 10 నిర్వాహకులు 2024వ సంవత్సరం నుంచి రూ.50వేలు అద్దె బకాయిలు ఉన్నారు. నిర్వాహకులుగా ఉన్న వారు నెల్లూరు నగరపాలక సంస్థకు బాడుగ చెల్లించకుండా ఉన్నందున, వారికి ఇదివరకే చాలాసార్లు నోటీసులు జారీచేసినా, ఎంతకీ సంబంధిత షాపు నిర్వాహకులు స్పందించకపోవడంతో, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు, నిర్వాహకులను మొండి బకాయిలుగా పరిగణించి అధికారులు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సివిఎస్ కిరణ్, ఎల్పి వర ప్రసాద్ల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి 10వ నెంబర్ గల షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు మాట్లాడుతూ భవన యజమానులు, అద్దెదారులు సకాలంలో నగరపాలక సంస్థకు చెందిన అన్ని రకాల పన్నులను వెంటనే చెల్లించి నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్పేట, బాలాజీ నగర్లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

## దేవరపాలెంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ



**నెల్లూరు రూరల్, మేజర్న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవరపాలెం గ్రామంలో ఎన్టిఆర్. భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళులా సాగుతున్నాయని తెలిపారు. అలాగే సంవత్సర కాలంలో ఇంత మంచి చేసిన కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలకు తెలిపారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్చార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి అశోక్ రెడ్డి, టిడిపి నాయకులు కుర్ర పద్మాకర్ రెడ్డి, తాటిపర్తి బాబు, శ్రీనివాసులు రెడ్డి, కుర్ర సుధాకర్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను సందర్శించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్న్యూస్ :** కావలి పట్టణంలో మానస థియేటర్ సెంటర్లోనే కలుగోల శాంభవి అమ్మవారి దేవస్థానంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మహాగణపతిని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి గణేష్ని ఆశీస్సులు అందరికీ ఉండాలని కావలి పట్టణ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గణేష్ ఉత్సవ కమిటీసభ్యులు పాల్గొన్నారు.